# జనమా.. ప్రభంజనమా

- ఆర్మూర్ ప్రజా ఆశీర్వాద సభ సముద్రం
- ఉద్యమకారుడు, నా కుటుంబంలో సభ్యుడు
- జీవన్ రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయం
- ఎలక్షన్‌లో ఆగం కావొద్దు... ఆలోచించి ఓటెయ్యండి
- రైతుబంధు, దళితబంధు పుట్టించిందే బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఆర్మూర్ ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ చిత్రంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నిజామాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జనమా ప్రభంజనమా అన్నట్లు ఆర్మూర్ ప్రజా ఆశీర్వాద సభ ఉన్నదని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ చెప్పారు. సభకు వచ్చిన జనాన్ని చూస్తుంటే సముద్రాన్ని తలపిస్తున్నదన్నారు. ఆర్మూర్ అంతా ఇక్కడే ఉన్నదా అన్నట్లుగా కనిపిస్తోందని తెలిపారు. ఈ సభకు వచ్చిన జనాన్ని చూసిన తర్వాత ఆర్మూర్‌లో జీవన్ రెడ్డి గ్యారంటీగా భారీ మెజార్టీతో గెలవడం ఖాయంగా కనిపిస్తున్నదని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఎర్రజొన్న రైతుల కోసం ఆమరణ దీక్ష చేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని తెలిపారు. ఎర్రజొన్న రైతులపై కాల్పులు జరిగిన నాడు కరీంనగర్ పర్యటనలో ఉన్న తాను హుటాహుటిన టూర్‌ను రద్దు చేసుకుని ఆర్మూర్‌కు వచ్చినట్లు సీఎం వివరించారు. ఆర్మూర్ పట్టణ శివారులో ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన బీఆర్ఎస్ అధినేత ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. పదేండ్ల తెలంగాణలో సాధించిన ప్రగతిని వివరించడంతోపాటు రాబోయే రోజుల్లో అమలు చేయబోయే కార్యక్రమాల సరళిని కేసీఆర్ ప్రజలకు వివరించారు.

**వెంట పడి సాధించే తత్వం...**

ఉద్యమంలో ఉన్నప్పుడు ఏ ఎమ్మెల్యే లేక మునుపు ఎర్రజొన్న రైతుల కోసం జీవన్‌రెడ్డి పాటుపడ్డారని చెప్పారు. పోలీసు కాల్పుల సమయంలో ఇక్కడికి వచ్చిన నాడే జీవన్ రెడ్డి తనకు సన్నిహితుడై కుటుంబ సభ్యుడిగా మారారని వివరించారు. పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లే నాయకుడు అని చెప్పారు. ఏదైనా పని కోసం వెంట పడి సాధించే రకమన్నారు. ఆలూర్, డొంకేశ్వర్ మండలాలు కావాలన్నప్పుడు... నేను అవసరమా? అని ప్రశ్నిస్తే మూడు రోజులు అలిగి కూర్చున్నారంటూ చెప్పారు. నమ్ముకున్న ప్రజల కోసం తప్పకుండా పనులు చేయించుకునే వ్యక్తి అని కీర్తించారు. జీవన్ రెడ్డిపై ప్రజల అభిమానం పెద్ద ఎత్తున కనిపిస్తున్నదని చెప్పారు. ఎలక్షన్లు వచ్చినందున బరిలో ఎవరో ఒకరు నిలబడతారని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలతో పాటు స్వతంత్రులు ఉంటారన్నారు. అభ్యర్థి మంచి చెడ్డా చూడడంతో పాటు అభ్యర్థి వెనుక పార్టీలను చూడాలన్నారు. గెలిపించే ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. పార్టీ చరిత్ర ఏంది. నడవడిక ఏంది. పద్ధతి ఏమున్నది. ఎవరు రాజ్యం చేసినప్పుడు ఏం నడక నడిచారో అర్థం చేసుకోవాలన్నారు. పార్టీల దృక్పథం, ఆలోచన సరళి ఎట్లున్నదో ఆలోచించి ఓటేస్తే లాభం జరుగుతుందని హితవు పలికారు. ఎవడో చెప్పిండని ఓటేస్తే ఆగమాగం అవుతుందన్నారు.

**మహారాష్ట్ర మాదిరిగా నీటి తీరువా లేదు...**

మహారాష్ట్రలో నీటి తీరువా అమలవుతున్నదని, తెలంగాణలో నీటి తీరువా రద్దు చేశామని కేసీఆర్ వెల్లడించారు. కరెంట్ ఫ్రీ అందుతుందన్నారు. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటున్నదన్నారు. రైతులు షావుకారి వద్ద చేయి చాపకుండా సొంత పెట్టుబడితో వ్యవసాయం చేసుకునేంతగా ఎదిగితే అదే బంగారు తెలంగాణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కరెంట్ సక్కగా ఇయ్యలేదని, ఆ బాధలు అందరికీ తెలుసన్నారు. ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతే డబ్బులు వసూలు చేసే పైరవీకారులు మన గ్రామాల్లోనే ఉండేదని పాత రోజులను గుర్తు చేశారు. మోటరు వైండింగ్ చేసే దుకాణాలు దివాలా తీశాయన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను 24గంటలు ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని.. ప్రధానమంత్రి మోదీ రాష్ట్రంలోనూ ఉచిత కరెంట్ ఇయ్యట్లేదన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం, బాగు చేయాలని పని చేశామన్నారు. రైతు బంధు ద్వారా ప్రజా ధనాన్ని దుబారా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ చెబుతున్నారని, పీసీసీ అధ్యక్షుడు 24గంటల కరెంట్ వేస్ట్ అంటున్నారని కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. 3 గంటలిస్తే పొలం పారుతదని కాంగ్రె స్ నేతలే అంటున్నారని పేర్కొన్నారు. అంజుమాన్‌కు అప్పులైతే తలుపులు పీక్కుపోయిన రోజులు కాంగ్రెస్ కాలంలో చూడలేదా? అని ప్రశ్నించారు. ఇప్పుడు వాళ్లు వచ్చి ఓట్లు అడుగుతున్నారని, సీఎం అని చూడకుండా దురుసుగా మాట్లాడుతున్నారని చెప్పారు. సమాధానం మీరే చెప్పాలంటూ ప్రజలకు కేసీఆర్ తెలిపారు. దళిత బంధు పుట్టించిందే బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. ఈ పథకం ఉండాలని ఎవరి మైండ్ కు కూడా రాలేదన్నారు. ఆదాయం పెరిగినా కొద్ది పథకాలు పెంచుకున్నామన్నారు. బీడీ కార్మికులు ఇక్కడ ఎక్కువ. 19రాష్ట్రాల్లో బీడీ కార్మికులకు పింఛన్లు ఇయ్యరు. మనమే ఇస్తున్నం.టేకేదార్లకు పింఛన్లు ఇస్తున్నం.

**కొత్త వారికీ బీడీ కార్మిక పింఛన్లు...**

వివిధ సభల్లో వచ్చిన వినతులు, విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో కొత్త వారికి బీడీ కార్మిక పింఛన్లు ఇచ్చేందుకు ఆలోచన చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ధరణి తీసేస్తామంటున్నారని, తీస్తే ఏమైతదో ఆలోచన చేయాలని రైతులను కోరారు. రైతుబంధు, రైతుబీమా ద్వారా వచ్చే డబ్బులు, ధాన్యం కొనుగోళ్లతో వచ్చే డబ్బులన్నీ ధరణితోనే రైతు అకౌంట్లో జమ అవుతున్నాయన్నారు. ధరణి లేకపోతే పైరవీకారులు పుట్టుకొస్తారన్నారు. మళ్లీ మొదటికి వస్తుందని వైకుంఠం ఆటలో పెద్ద పాము మింగినట్లు అవుతుందన్నారు.

## అంకాపూర్ ప్రాణంతో సమానం

ఈ ప్రాంతంలో రైతులు ఎక్కువగా ఉంటారని పంటలు బ్రహ్మాండంగా పండిస్తారని కేసీఆర్ చెప్పారు. అంకాపూర్ తనకు ప్రాణంతో సమానం అంటూ చెప్పారు. అంకాపూర్‌ను తాను ప్రచారం చేసినంతగా ప్రపంచంలో ఎవ్వరూ చేయలేదని చెప్పారు. అంకాపూర్ చైతన్యంతో చాలా గ్రామాలు రాష్ట్రంలో ముందుకు వచ్చాయని తెలిపారు. ప్రజాస్వామ్యంలో రావాల్సిన మెచ్యూరిటీ మన దగ్గర రాలేదన్నారు. ఎలక్షన్లు వస్తే అడ్డగోలుగా మాట్లాడడం, అబద్ధాలు, బద్నాములు చేయడం భారతదేశంలో కొనసాగుతుందన్నారు. ఓటు అనే వజ్రాయుధం జాగ్రత్తగా వినియోగించాలన్నారు. ఓటు అనేది మన తలరాతను మార్చుతుందన్నారు. 50 ఏండ్లు కాంగ్రెస్ పార్టీ రాజ్యం చేసినప్పుడు ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టిందే రాష్ట్ర సాధన కోసమని, ఆ తర్వాత రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం ఏ విధంగా కృషి చేస్తున్నామో మీ కండ్ల ముందు ఉన్నదంటూ ప్రజలకు వివరించారు. కొత్తగా రాష్ట్రం వచ్చిన నాడు ఏదీ సక్కగా లేదని, కొత్త కుండలో ఈగ సొచ్చినట్లు భయంకరమైన పరిస్థితులను ఒక్కోటి దాటుకుంటూ వచ్చామన్నారు. ఆరు నూరైన సరే కచ్చితంగా వ్యవసాయాన్ని స్థిరీకరణ చేయాలని, గ్రామాలు ఆర్థికంగా పటిష్టవంతం కావాలని నిర్ణయించుకుని పని చేశామన్నారు. రైతుబంధుకు ఎవరైనా దరఖాస్తు చేశారా. అలాంటి రైతుబంధును పుట్టించింది కేసీఆర్ మాత్రమేనన్నారు.పథకాన్ని ఎం.ఎస్. స్వామినాథన్ స్వయంగా సీఎం ఆఫీస్ దాకా వచ్చి శభాష్ అన్నారని గుర్తుకు తెచ్చుకున్నారు. ఐక్యరాజ్య సమితి సైతం గొప్ప పథకమని కితాబునిచ్చిందని కేసీఆర్ వెల్లడించారు.

## ఆర్మూర్ అభివృద్ధికి
# కర్మ, కర్త, క్రియ కేసీఆర్

- రూ.3వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు
- కేసీఆర్ ఆశీస్సులు.. ప్రజల దయతో మళ్లీ గెలుస్తా
- ఆర్మూర్ ప్రజాశీర్వాద సభలో జీవన్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్, నవంబర్ 3 : ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి కర్మ, కర్త, క్రియ కేసీఆర్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు.ఆర్మూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతూ అడిగింది, అడగనిది కూడా ఇచ్చిన మనసున్న మహారాజు అన్నారు. కేసీఆర్ తన ఆరాధ్య దైవం, ఉద్యమ, రాజకీయ జీవితాన్ని ఇచ్చార న్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏది అడిగినా కాదనలేదని తెలిపారు. ఆయన అండతో రూ. 3వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెచ్చానని వివరించారు. కేసీఆర్ ఆశీస్సులతో, ప్రజల దయతో మళ్లీ గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో దగా పడ్డ ఎర్రజొన్న రైతులకు బకాయిలు చెల్లించి ఆదుకున్న దేవుడు కేసీఆర్ అన్నారు. అభివృద్ధి ప్రదాతకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానన్నారు. ఆర్మూర్ ప్రజా ఆశీర్వాద సభలో రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, నమస్తే తెలంగాణ సీఎండీ, ఎంపీలు దీవకొండ దామోదర్ రావు, సురేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్ గుప్తా, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు డా.మధుశేఖర్, మార గంగారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్, ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, సీనియర్ నాయకులు కోటపాటి నర్సింహనాయుడు, రాజారాం యాదవ్, మహారాష్ట్ర రైతు సంఘం నాయకులు అన్నాసాబ్ మానే, ఘన్‌శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



సభకు అశేషంగా తరలివచ్చిన జనం



సభా ప్రాంగణం నిండిపోవడంతో బయటే నిల్చొని సీఎం ప్రసంగం వింటున్న జనం

